

వడ్డీ కట్టలేదని.. ఇంటి నుంచి గెంటేశారు

పక్షవాతంతో బాధపడుతున్న మహిళపై కారుణ్యం చూపకుండా.. వడ్డీ వ్యాపారులు కర్కశంగా వ్యవహరించారు. ఇంటికి తాళం వేసి బయటికి నెట్టేశారు. -8లో



గౌరవం లేదు.. వేతనం రాదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు విలువ లేకుండాపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. -8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం 25.6 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ బదిలీలకు నేటి నుంచి దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడపజిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్ కార్పొరేషన్, మునిపాలిటీ యాజమాన్యాల్లో పనిచేసే గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బుధవారం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుందని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు . తప్పనిసరి బదిలీ అయ్యేవారు.. అభ్యర్థన బదిలీల కోరేవారు నేటి నుంచి ఆన్‌లైన్‌లో బదిలీ అప్లికేషన్ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలని డీఈఓ సూచించారు.

81 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 81 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 28 పరీక్షా కేంద్రాలలో 223 మంది విద్యార్థులకుగాను 81 మంది హాజరుకాగా 142 మంది గైర్హాజయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ నాలుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని డీఈఓ తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో చేరేందుకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడగించినట్లు ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. 10వ తరగతి పాస్ లేక ఫెయిల్‌తోపాటు ఆపై విద్యార్హతలు కలిగి ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐ వద్దకు వెళ్లి iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు స్వయంగా కూడా రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్టర్ చేసిన దరఖాస్తును తప్పని సరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులను ఇచ్చేందుకు వచ్చిన నిరుద్యోగులు

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల (రిమ్స్) ఆవరణలోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో పోస్టులకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ హాస్పిటల్‌లో కాంట్రాక్ట్ విధానంలో 19 పోస్టులు, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో 50 పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మంగళవారం ఆఖరిరోజు కావడంతో నిరుద్యోగులు వెల్లువలా వచ్చారు. సిబ్బంది పోస్టుల వారీగా కౌంటర్‌లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు.

ఏపీ ఐసెట్‌లో మెరిసిన రైతుబిడ్డ



సందీప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఐసెట్ ఫలితాల్లో రైతుబిడ్డ సందీప్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో వ్యవసాయ కుటుంబానికి చెందిన ద్వారకచర్ల జగదీశ్వర్‌రెడ్డి, సావిత్ర దంపతుల కుమారుడు సందీప్‌రెడ్డి ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాభ్యాసం స్థానికంగా, ఇంటర్‌ను హైదరాబాదులోని నారాయణ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీని డిల్లీలోని హిందూ కళాశాలలో పూర్తి చేశాడు. ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ మెనెజ్‌మెంట్(ఐఐఎం)లో ర్యాంకు సాధించాలనేదే తన లక్ష్యమని.. త్వరలో జరిగే ఐఐఎంలో కూడా మంచి ర్యాంకు సాధిస్తానని సందీప్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ జాగిలం మృతి



సన్నీకి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: జిల్లా పోలీస్ శాఖకు 2013 నుంచి విశేష సేవలందించి తొమ్మిది నెలల కిందట పదవీ విరమణ పొందిన పోలీస్ జాగిలం 'సన్నీ' మంగళవారం వయోభారంతో మృతిచెందింది. ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు అర్‌ఐ టైటస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో 'సన్నీ' పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. లాబ్రడార్ జాతికి చెందిన సన్నీని పలు వీవీఐపీల బందోబస్తు విధులు, సీఎం బందోబస్తు విధులు, గోదావరి పుష్కరాలు, తిరుమల బ్రహ్మోత్సవాలలో విధులకు తీసుకెళ్లారు. అసెంబ్లీ బందోబస్తు, ఎన్నికల బందోబస్తు విధుల్లో సమర్థంగా విధులు నిర్వహించి ఆ జాగిలం ప్రశంసలందుకుంది. దీంతో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

సోలార్.. వద్దు సార్!

పీఎం సూర్యనూ.. సీఎం చంద్రన్ననూ నమ్మని జనం

'వంద అడుగులు ఉన్న ప్రతి ఇంటిపైనా ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోండి..' ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఇవి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పరుగులు పెడుతున్నారు. ఎంత అవగాహన కల్పించినా సదరు పథకాన్నీ..సీఎం చంద్రబాబు మాటల్ని నమ్మలేమంటూ జనాలు ఆసక్తిచూపకపోవడంతో సిబ్బందికి ఇబ్బంది తప్పడం లేదు.



- పీఎం సూర్యఘర్ పథకంపై లక్ష్యం విధింపు
- కేంద్రం ఆదేశాలతో ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారుల ఉరుకులు పరుగులు
- ప్యానెల్స్ పెట్టుకోవాలంటూ వినియోగదారులకు అవగాహన
- ఆసక్తి చూపని జనం



సోలార్ ప్యానెల్స్

కడప కార్పొరేషన్: మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభు త్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు వైఎస్సార్ కడప జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ అమర్చాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పథకం మంచిదే అయినా కొన్ని చోట్ల వినియోగదారులను బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మరోవైపు పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించి ఏర్పాటు చేయాలని కూటమి సర్కార్ డిస్కమ్‌లపై ఒత్తిడి తీసుకొస్తోంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

- ఈ పథకంలో చేరాలంటే ముందుగా 'సూర్యఘర్' యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరునెలల కరెంటు బిల్లు కాపీలను జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉన్నప్పటికీ అందరికీ వర్తింపజేస్తున్నారు. ట్రాన్స్ కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలోవాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం రాయితీని అందిస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయి. చివరగా ఇంటి పై కప్పుపై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తిని...వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ను లెక్కిస్తారు.

కరెంట్ అమ్ముకోండి... అంటూ ప్రచారం

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు...ఇప్పుడు ఎఫ్‌పీసీసీఏ చార్జీల మోత మోగిస్తూ గుండె గుభేల్‌మనేలా చేస్తున్నారు. సంపద సృష్టించడం తనకు బాగా తెలుసునన్న బాబు, ఓవైపు విద్యుత్ బిల్లులను అమాంతం పెంచేసి, మరోవైపు సూర్యఘర్ ప్రాజెక్టు పేరుతో వినియోగదారుల నడ్డి విరిచేందుకు యత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుంటే బిల్లు కట్టకపోవడంతోపాటు కరెంటు మీరే అమ్ముకొని లాభాలు పొందవచ్చునంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. అయినా ప్రజలు స్పందించకపోవడంతో అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో సర్కిళ్లలోని జోన్ల వారీగా లక్ష్యాలు విధించారు. నిర్దేశించిన సమయంలోగా లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.

రాయితీ అందించినా గుదిబండే...!



రాయితీ ద్వారా ప్రాజెక్టు పెట్టుకోవచ్చంటూ అధికారులు ప్రచారం చేస్తున్నా వినియోగదారునికి మొదట భారం తప్పేలా కనిపించడం లేదు. ఉదాహరణకు 3 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ పెట్టుకోవాలంటే రూ.78వేల వరకు గరిష్టంగా సబ్సిడీ అందిస్తామని చెబుతున్నారు. అయితే ఈ రాయితీ మనం వినియోగించుకునే పలకలకు అనుగుణంగా ఉంటుంది. అంటే రూ.78వేల కంటే తక్కువ సబ్సిడీ వస్తుంది కానీ వినియోగదారుడు మాత్రం రూ.1.80లక్షల వరకూ భరించాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు కూడా చార్జీలు వసూలు చేసేవారు. ప్రజలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఆ చార్జీల నుంచి ఉపశమనం కల్పించారు.

ఎక్కువ మందిని ఒప్పించండి

ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో ఇప్పటి వరకూ 67480మంది వినియోగదారులు పీఎం సూర్యఘర్ పరిధిలోకి వచ్చారు. అయినా ఇంకా టార్గెట్లు పూర్తి చేయలేదని విద్యుత్ అధికారులపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోంది. విద్యుత్ సరఫరాకు సంబంధించిన అంశాల కంటే సూర్యఘర్ ఒత్తిడే అధికంగా ఉందని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. సోలార్ ప్యానెల్స్ అమర్చిన తర్వాత అవి పాడైతే వాటిని బాగు చేసేందుకు అధిక మొత్తం అవుతుందని, అందుకే ఎవరూ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అయినా ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు 240 యూనిట్లు లేదా రూ.2వేల బిల్లు వచ్చేవారు 2 కిలోవాట్ల వరకూ సోలార్ ప్యానెల్స్ అమర్చుకోవాలంటే ప్రభుత్వం సోలార్ ప్లాంటు ఆధారంగా రూ.30వేల నుంచి రూ.75వేల వరకూ రాయితీ ఇస్తుంది. గరిష్టంగా సబ్సిడీతో కలిసి రూ.2లక్షల వరకూ రుణ సదుపాయం కల్పిస్తారు. అందులో 10 శాతం మొత్తం అనగా రూ.20వేలు వినియోగదారుడు చెల్లించాలి.

- పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి మొత్తంగా 67529 దరఖాస్తులు రాగా అందులో 67480 అప్లికేషన్లు ఆమోదం పొందాయి. అందులో 63475 ఎస్సీ, ఎస్టీలు ఉండగా, 4005 ఇతరులు ఉన్నారు. వీటిలో 1087 మంది వెండార్‌ను సెలెక్ట్ చేసుకున్నారు. 42 అప్లికేషన్లు తిరస్కరణకు గురవగా, 538 మందికి సూర్య ఫలకలు ఇన్‌స్టాల్ చేశారు. 415 అప్లికేషన్లకు సబ్సిడీ ఇచ్చారు.

	కడప	మైదుకూరు	ప్రొద్దుటూరు	పులివెందుల
అప్రూవ్డ్ అప్లికేషన్స్	19557	19099	19121	9345
వెండార్ సెలెక్టెడ్	453	173	358	103
రిజెక్టెడ్	8	16	15	3
ఇన్‌స్టాలేషన్	214	83	213	28
సబ్సిడీ డిపాజిటెడ్	158	73	166	18
ఎస్సీ, ఎస్టీలు	17898	18767	18047	8763
ఇతరులు	1659	712	1052	582

వైద్య విద్యలో పాత పద్ధతులే!

పోస్టుల భర్తీలో డీడీలు చెల్లించాలని నిబంధన.. అభ్యర్థులకు తప్పని ఇబ్బందులు

కడప కార్పొరేషన్: దేశంలో, రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయింది. అన్ని కార్యాలయాల్లో ఈ-ఆఫీసు పేరుతో పేపర్ లెస్ ఫైళ్లు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. అన్నిచోట్లా నగదు లావాదేవీలు చాలా వరకూ తగ్గిపోయాయి. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం అంటూ అందరూ యూపీఐ యాప్‌ల ద్వారా పేమెంట్లు చేస్తున్నారు. ఇలా సాంకేతికత ఇంతగా పెరిగిన ఈ తరుణంలో వైద్య విద్య శాఖలో మాత్రం ఇంకా పాతరకం మూస పద్ధతులనే అవలంబిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఏప్రిల్ 25వ తేది ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కొన్ని పోస్టులు భర్తీ చేయడానికి ఆ కళాశాల ప్రిన్సిపల్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా పోస్టులకు మే నెల 20వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీగా పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఓసీలైతే రూ.400, ఎస్సీ, ఎస్టీ, బీసీ,ఈడబ్ల్యూఎస్, వికలాంగులైతే రూ.300 డీడీ తీయాలని నిబంధన విధించారు. దీనివల్లే అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి, ఇబ్బందులకు గురయ్యారు. చాలా బ్యాంకుల్లో క్యాష్ డీడీలు ఇవ్వడం లేదు. ఏ బ్యాంకులో అయితే వారికి అకౌంట్ ఉంటుందో అక్కడే ఇస్తున్నారు. అదికూడా క్యాష్ చెల్లిస్తే కాకుండా అకౌంట్‌లో డబ్బులు ఉంటే విత్‌డ్రా స్లిప్ జత చేసి, బ్యాంకు పుస్తకంతోపాటు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా డీడీలు తీసుకోవడానికి అభ్యర్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అనేక వ్యయప్రయాసలకు గురయ్యారు. స్వయంగా దరఖాస్తు చేసుకోలేని వికలాంగులు, మహిళలు, వితంతువులు డీడీలు తీయడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ డబ్బు ఆన్‌లైన్‌లోగానీ, ఇతర పద్ధతుల ద్వారా చెల్లించే విధంగా ఏర్పాటు చేసి ఉంటే సులభతరంగా ఉండేదని, చాలామంది దరఖాస్తు చేసుకునేందుకు ఆస్కారం ఉండేదని చెబుతున్నారు. ఇకనైనా వైద్య విద్య శాఖ , వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే విధానాలు తీసుకురావాలని అభ్యర్థులు కోరుతున్నారు.

అన్నదాతలకు సహకారం

- పంటలకు పెరిగిన రుణ పరపతి
- 2025-26కు వ్యవసాయ, అనుబంధ రుణ లక్ష్యం రూ. 13286 కోట్లు



కడప అగ్రికల్చర్: వ్యవసాయాధారిత జిల్లా రైతాంగానికి, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధితోపాటు ఇతర రుణాలు మంజూరు విషయంలో అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. రైతులకు అందించే పంటల రుణ పరపతిని ఈ ఏడాది పెంచుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం మేరకు పంట రుణ పరపతి రైతులకు పెరగనుంది. త్వరలో పెరిగిన నివేదికలు ఆయా బ్యాంకులకు చేరనున్నాయి.

2025-26కు ఇవ్వనున్న రుణాల వివరాలు

తాజాగా పెరిగిన రుణ పరపతి మేరకు జిల్లాలో అన్ని రంగాలకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రుణాలకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో వ్యవసాయరంగానికి, రూ. 13,286 కోట్లు, పరిశ్రమల రంగాలకు, రూ. 3,410 కోట్లు, ఇతర రుణాలకు రూ. 906, నాన్ ప్రయారిటి రంగాలకు రూ. 4136 కోట్లు అందించేలా రుణ ప్రణాళికలను సిద్ధం చేశారు. వీటితోపాటు హౌసింగ్, విద్య, చేతి వృత్తులు, మత్స్యకార, ఎస్‌హెచ్‌జీలతోపాటు పలు రంగాలకు సంబంధించిన రుణాలు కలిపి ఈ ఏడాది మొత్తంగా జిల్లాలోని అన్ని బ్యాంకుల పరిధిలో రూ. 21739 కోట్లు రుణాలను అందించడమే లక్ష్యంగా అధికారులు నిర్ధారించారు.

రుణ పరపతి పెరిగింది



స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కమిటీ ఉత్తర్వుల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ పరపతి పెరిగింది. చిన్న, సన్నకారు, వరి, ఉద్యానవన రైతులతోపాటు ఎంఎస్ఎంఈఓ, వ్యక్తిగత రుణాలు అందించనున్నాయి. నిర్దేశిత లక్ష్యం నెరవేరేలా బ్యాంకర్లకు అన్ని మార్గ దర్శకాలు అందించాం. అన్ని వర్గాల సంబంధించి అర్హత ఉన్న వారికి రుణాలు అందుతాయి. – జి. జనార్ధనమ్, లీడ్ బ్యాంక్ మేనేజర్, కడప

టీడీపీలో నయా నియంత!

- కడప గడపలో తలలు పట్టుకుంటున్న టీడీపీ నేతలు
- విజయం కోసం పనిచేసిన నేతల్లో తీవ్ర అసంతృప్తి
- పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసినా నేతల్లో నిస్తేజం
- నేడు రాజరాజేశ్వరీ కళ్యాణమండపంలో మినీ మహానాడు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీలో జెండా మోసినోళ్లకే పెద్దపీట.. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడంతా వ్యక్తిగత భజన చేసినోళ్లకే పదవులు. ముఖ్యంగా కడప గడపలో అక్షరాల ఇదే నిజమని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికి ఆశించిన గుర్తింపు లభించలేదు. పైగా భౌతికదాడులు తెరపైకి వస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే నియంతృత్వం రాజ్యమేలుతోందని తెలుగుతమ్ముళ్లు వాపోతున్నారు.

- కడప నియోజకవర్గంలో టీడీపీ విపక్షంలో ఉండగా జి.లక్ష్మిరెడ్డి, ఎస్. గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, అమీర్‌బాబు ఈ నలుగురు ప్రధానంగా తెరపై కన్పించేవారు. ఇప్పుడు వారి పరిస్థితి, ప్రాధాన్యత ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చని టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకుడొకరు చెప్పుకొస్తున్నారు. పైగా మినీ మహానాడు సందర్భంగా ఆ నలుగురు కూడా వాట్సాప్ మేసేజ్ ద్వారా హాజరు కావాల్సిన దుస్థితి నెలకొంది. అందులో ఇద్దరికి వాట్సాప్ మేసేజ్ కూడా అందలేదని తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు తెరపైకి వస్తున్న తరుణంలో చాలా వరకూ పార్టీనే సర్వస్వం అనుకున్న వారు క్రమంగా కనుమరుగు అవుతూ వస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో ఇదే పరిస్థితి నెలకొందని పలువురు వివరిస్తున్నారు.

చిన్నచౌక్ కార్యాలయం మూత...

ఎమ్మెల్యేగా మాధవీరెడ్డి ఎన్నికైన తర్వాత అప్సరా హాల్ సమీపంలో 1 నుంచి 13 డివిజన్లు కోసం ఎమ్మెల్యే కార్యాలయం ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాంప్రసాదరెడ్డి కేంద్ర బిందువుగా ఏర్పాటైనా ఆ కార్యాలయం సరిగ్గా ఆరునెలలకు ఎమ్మెల్యే మాధవిరెడ్డి మూపించారని ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయం ప్రారంభించడం ఎందుకు? అంతలోనే మూపించడం ఎందుకని 'తమ్ముళ్లు' ప్రశ్నిస్తున్నారు. నగరంలో మాధవిరెడ్డి విజయం కోసం రాంప్రసాదరెడ్డి, మరోవైపు రూరల్‌లో పాతకడప మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి విశేషంగా పనిచేశారు. ఏడాది తిరక్కముందే ఆ ఇరువురితో అంటీ ముట్టనట్లుగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు అధికారిక పర్యటనల్లో కూడా పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన వారికి కనీస పిలుపు లేకుండా పోతోందని పలువురు వాపోతున్నారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం బ్రౌన్ లైబ్రరీ, స్టార్టప్ కార్యాలయాలకు భూమిపూజ కార్యక్రమాలను పలువురు ఉదహరిస్తున్నారు.

ఆ కార్పొరేటర్లే పెద్దదిక్కు...

తెలుగుదేశం పార్టీకి ఉమాదేవి ఒక్కరే కార్పొరేటర్. ఉన్న ఒక్కగానొక్క కార్పొరేటర్‌ను చేరదీయడం అటుంచితే, నిండు సభలో అవమానించారు. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆ విషయం ప్రస్ఫుటమైంది. మరోవైపు 8మంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లును బెదిరించి బలవంతంగా తెలుగుదేశం కండువా కప్పారు. అందుకు 8వ డివిజన్ కార్పొరేటర్ ఉదంతమే నిదర్శనం. కార్పొరేటర్ వెంచర్‌పైకి కార్పొరేషన్ అధికారులను ఉసిగొల్పి, ఆపై కార్పొరేటర్ దంపతులకు టీడీపీ కండువా కప్పారు. ఇలా బెదిరింపులకు లొంగి టీడీపీలో చేరిన వారే ప్రస్తుతం కడపలో టీడీపీకి పెద్ద దిక్కయ్యారని పలువురు సీనియర్లు వాపోతున్నారు. ఎమ్మెల్యేకు అనుకూలంగా ప్రెస్‌మీట్ పెట్టాలన్నా వారే, భజన చేయాలన్నా వారే ప్రధానంగా నిలుస్తున్నారని విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు. ఈ తరుణంలో బుధవారం రాజరాజేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో కడప మినీ మహానాడు నిర్వహిస్తున్నారు. ఆవిర్భావం నుంచి టీడీపీ జెండా మోసిన కార్యకర్తలకు ఏపాటి మర్యాద లభిస్తోందో వేచిచూడాల్సిందే!

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- బహిరంగ సభ స్థలం వద్ద అధికారులతో సమావేశం




మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రొటోకాల్ నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడులతో కలిసి జిల్లాలో ముఖ్యమంత్రి పాల్గొనే సీకే దిన్నె మండల పరిధిలోని పబ్బాపురం సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభా స్థలం వద్ద అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా విధులు కేటాయించిన అధికారులందరూ.. ప్రొటోకాల్ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం, పరిసరాలలో పారిశుద్ధ్య పనులు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీపీఓ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ నాగరాజు, పోలీసు, ఫైర్ ఆఫీసర్ ధర్మారావ్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ సుందరీకరణకు ప్రణాళిక

- జేసీ ఆదర్శ్‌రాజేంద్ర



హార్సిలీహిల్స్‌పై పరిశీలన చేస్తున్న జేసీ, అధికారులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అభివృద్ధి, సుందరీకణ కోసం ప్రణాళిక అమలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మదనపల్లె సబ్‌కలెక్టర్, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ మేఘస్వరూప్, తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్, పీకేఎం ముడా ఇంజినీర్లు, డీఈ సూర్యనారాయణతో కలిసి కొండపై విస్తృతంగా పరిశీలనలు నిర్వహించారు. కొండపై అతిథిగృహాలు, గాలిబండ, జిడ్డు సర్కిల్, స్విమ్మింగ్ పూల్, గవర్నర్‌బంగ్లా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేపట్టాలి, సుందరీకణ పనులు చేయాలి, వాటికి సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాలపై సమీక్ష చేశారు. రెవెన్యూ అతిథిగృహం ప్రయివేటుకు అప్పగించగా.. దాన్ని ఎప్పటిలోగా ప్రారంభిస్తారని జేసీ లీజుదారునితో చర్చించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి పర్యాటకులకు గదులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం జేసీ మీడియాతో మాట్లాడుతూ గాలిబండ వద్ద సందర్శకులు ప్రకృతి అందాలను తిలకించేందుకు బెంచీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

28న మోడల్ డీఎస్సీ

కడప ఎడ్యుకేషన్ : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న మోడల్ డీఎస్సీ నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాలశివకుమార్ తెలిపారు. కడప డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ డీవైఎఫ్ఐ పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ జరిగిందన్నారు. మోడల్ డీఎస్సీ పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. రూ.50 ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బనరసింహలు, విజయ్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని బీటెక్ విద్యార్థి మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని అంబకపల్లి రోడ్డు సమీపంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని యువతి స్వాతి మృతిచెందింది. పోలీసుల కథన మేరకు.. వరప్రసాద్, కళావతిల కుమార్తె స్వాతి బీటెక్ పూర్తి చేసింది. ఉద్యోగం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా రాకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్న దుద్యాలలో ఘర్షణ

ముద్దనూరు : మండలంలోని చిన్న దుద్యాలలో తాగునీటి బోరు మరమ్మతుల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ భర్త మదన్‌మోహన్‌రెడ్డి వర్గీయులు బోరును తాము మరమ్మతు చేయించాల్సి ఉంది.. మీరు ఎలా చేయిస్తారంటూ మరో వర్గం వారిని ప్రశ్నించారు. దీంతో మాటా మాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణలో వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డికి రక్త గాయాలయ్యాయి. మదన్‌మోహన్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులు సర్పంచ్ ప్రమేయం లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ కక్షలకు ఆజ్యం పోయడంతోనే ఈ ఘర్షణలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు.

మినీ మహానాడుకు బత్యాల, కస్తూరి డుమ్మా

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మినీ మహానాడుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు, టిడిపి రాష్ట్ర నిర్వహక కార్యదర్శి, మాజీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు హాజరుకాకపోవడంపై పలువురు టీడీపీ శ్రేణులు చర్చించుకున్నారు. స్థానిక రాజు రెసిడెన్సీలో మంగళవారం ముందస్తుగా టీడీపీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కస్తూరి, బత్యాల వర్గీయులు హాజరుకాలేదు. గత నెలలో రూపానందరెడ్డి కార్యాలయం వద్ద బయటపడ్డ వర్గ విభేదాలు ఇంకా సమసిపోలేదని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

గౌరవం లేదు.. వేతనం రాదు

పలువురు ఎంపీటీసీల ఆవేదన



నరసాపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయం

కాశినాయన : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు విలువ లేకుండాపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో ఏ పనులు చేయించలేని పరిస్థితి తమకు ఉండడంతో గౌరవం లేకుండాపోయిందని, దానికి తోడు కనీసం రెండేళ్ల నుంచి గౌరవ వేతనాలు అందలేదని పలువురు ఎంపీటీసీలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో 559 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వారికి ప్రతి నెలా రూ.3వేల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం ఎంపీటీసీలకు చెల్లించలేకపోయింది. 2024 జూలై, 30న కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతకుముందు పెండింగ్ వేతనాలతో పాటు దాదాపు రెండేళ్ల గౌరవ వేతనం రావాల్సి ఉంది. నేటికీ ప్రభుత్వం వాటిపై దృష్టి సారించలేదని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలచే ఎంపికైన ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా టీడీపీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడం మినహా ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారుల సమస్యలను తీసుకువచ్చినా పట్టించుకున్న పాపాన పోవడంలేదని చెబుతున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు తమను ఆహ్వానించక పోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరుపై తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, వివక్షకు గురిచేస్తున్నారని వారు మండిపడుతున్నారు.

గౌరవ వేతనం మంజూరు చేయాలి

రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలి. అలవెన్స్ కూడా ఇవ్వడం లేదు. గతంలో మాకు ఇస్తున్న నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రస్తుతం నిధులు మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేశారు.

– సరిత, ఎంపీటీసీ, పరికుంట్ల, కాశినాయన మండలం

ఎంపీటీసీలు అంటే అంత అలుసా

ఎంపీటీసీలు అంటే కూటమి ప్రభుత్వానికి అలుసైపోయింది. అందరూ ఆర్థికస్తోమత కలిగిన వారిలా ప్రభుత్వం పరిగణిస్తోంది. రెండేళ్లకు పైగా వేతనాలు ఇవ్వకపోతే సభలు, సమావేశాలకు ఎలా రావాలి. ప్రభుత్వం పెండింగ్ వేతనాల చెల్లింపుపై స్పందించాలి.

– నాగార్జున, ఎంపీటీసీ, ఇటుగుల్లపాడు, కాశినాయన మండలం

వడ్డీ కట్టలేదని.. ఇంటి నుంచి గెంటేశారు

వృద్ధ మహిళపై వ్యాపారుల దాష్టీకం



ఇంటి ఎదుట బాధితులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, ఆర్‌సీపీ నాయకులు

కడప అర్బన్ : పక్షవాతంతో బాధపడుతున్న మహిళపై కారుణ్యం చూపకుండా.. వడ్డీ వ్యాపారులు కర్కశంగా వ్యవహరించారు. తమ భర్త చేసిన అప్పు కట్టలేదనే నెపంతో ఇంటికి తాళం వేసి వృద్ధురాలు, ఆమె కుమార్తెను బయటికి నెట్టేశారు. ఎండ, వానకు ఇద్దరూ బిక్కుమంటూ బయటే ఉండాల్సి వచ్చింది.. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కడప రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివానందపురంలో భూమన పిచ్చమ్మ, ఆమె కుమార్తె వెంకటసుబ్బమ్మ నివాసముంటున్నారు. స్థానిక వడ్డీ వ్యాపారులు బాల గురవయ్య, అతడి కుటుంబ సభ్యులు అకస్మాత్తుగా వచ్చి.. డబ్బు కట్టలేదంటూ పిచ్చమ్మ, వెంకటసుబ్బమ్మలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇంటికి తాళం వేసి.. సామాన్లు బయటపడేసి వెళ్లిపోయారు. దీంతో ఆదివారం నుంచి తల్లి, కుమార్తె ఇంటి ఎదుటే బిక్కు మంటూ ఉండిపోయారు. పిచ్చమ్మ మాట్లాడుతూ తన మనుమరాలు వివాహం సమయంలో బాలగురవయ్య వద్ద రూ.4 లక్షలు అప్పు తీసుకున్నారని, ఆ సొమ్ము చెల్లించలేదని తమ రెండున్నర సెంట్ల స్థలంలో ఉన్న ఇంటిని స్వాధీనం చేసుకున్నారన్నారు. డాక్యుమెంట్లలో సంతకాలు చేయించుకుని దౌర్జన్యంగా బయటకు తోసి వెళ్లిపోయారని బోరున విలపించారు. తనకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మహిళలను ఇంటినుంచి గెంటేసిన బాలగురవయ్య, వారి కుమారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఆర్‌సీపీ నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. బాధితుల ఇంటి ఎదుట బైఠాయించి మంగళవారం నిరసన తెలిపారు. పిచ్చమ్మకు చెరందిన ఐదు సెంట్ల స్థలాన్ని కాజేసేందుకు బాలగురయ్య కుట్ర చేశారని, ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాల గురవయ్య, మురళి, బాలచంద్ర, బాలుడు, ఓబులేసు, ఓబుళపతి, లక్ష్మీదేవి, బాలమ్మ తదితరులు ఇంట్లోకి చొరబడి పిచ్చమ్మపై దాడి చేశారన్నారు. మూడు బంగారు ఉంగరాలు, రూ.16 వేల నగదు, ఇతర సామగ్రి కాజేశారన్నారు. వర్షంలో తడుస్తూ, ఎండలో ఎండుతూ మహిళలు బిక్కుమంటున్నారని వాపోయారు. ఇరువురి బాధితులకు న్యాయం జరిగేంతవరకూ ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఆర్‌సీపీ నాయకులు మల్లికార్జున, భాగ్యలక్ష్మి, విజయ్, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్‌బియ్యం వాహనం

దువ్వూరు : అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎర్రబల్లె క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. బొలెరో వాహనంలో తరలిస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని, విచారించగా రేషన్ బియ్యాన్ని దువ్వూరుకు చెందిన మారుగాని సురేంద్ర కొనుగోలు చేసి, అమ్ముతున్నట్లు తెలిసిందన్నారు. పంచాయతీ అధికారుల సమక్షంలో పంచనామా చేశామని, 50 బస్తాల రేషన్ బియ్యం మొత్తం విలువ రూ.1,10,400 ఉంటుందని వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

కడప విమానాశ్రయంలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ చేసిన ఆక్టోపస్ సిబ్బంది, పోలీసులు

కడప అర్బన్ : ఉగ్రవాదులు విమానాశ్రయంపై దాడికి దిగితే ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలో వివరించేలా ఆక్టోపస్ బృందం ఆధ్వర్యంలో కడప విమానాశ్రయంలో మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, వైద్యం, అగ్నిమాపక శాఖల సమన్వయ చర్యలను ఏఎస్పీ మూర్తి పరిశీలించారు. డ్రిల్‌లో కమలాపురం సీఐ ఎస్‌కె.రోషన్, వల్లూరు ఎస్ఐ బి.పెద్ద ఓబన్న, రెవెన్యూ అధికారులు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక అధికారులు చురుకుగా పాల్గొన్నారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో విభిన్న విభాగాల మధ్య సమన్వయం, స్పందన వేగం మరియు తక్షణ చర్యలపై స్పష్టత పెరిగిందని అధికారులు తెలిపారు.

పాఠశాల భవనాలు కూల్చివేయడం దారుణం



కూలిన పాఠశాల భవనాలు



విలేకరులతో మాట్లాడుతున్న కరస్పాండెంట్ షర్మిల

న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ షర్మిల

కడప ఎడ్యుకేషన్ : కడప సీఎస్ఐ చర్చి వెనుక ఉన్న న్యూ మోడల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ భవనాలను ఎలాంటి సమాచారం లేకుండా అర్ధ రాత్రి కూల్చి వేయించడం దారుణమని స్కూల్ కరస్పాండెంట్ షర్మిల అన్నారు. పాఠశాల ఆవరణలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ బిషప్ చెప్పినట్లు తాను నడుచుకోలేదని, కక్షపూరితంగా భవనాలను కూల్చి వేయించాడని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి ప్రయత్నమే చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేశామని, దీంతో తనను పిలిపించి మాట్లాడిన బిషప్ 2025–26 విద్యా సంవత్సరం వరకూ గడువిస్తున్నామని చెప్పారన్నారు. మళ్లీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి 1.40 గంటలకు బిషప్ కుమారుడు కొంతమంది మనుషులతో వచ్చి భవనాలను కూల్చివేయించారన్నారు. పాఠశాలలో 250 మంది విద్యార్థులున్నారని, 20 రోజుల్లో పాఠశాల పునఃప్రారంభించాల్సి ఉండగా.. ఇలా చేయడం సరికాదన్నారు. జూన్‌లో పిల్లలను ఎక్కడ కూర్చోబెట్టాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిన భవనాల కింద ఫర్నిచర్, పిల్లల విద్యాసామాగ్రి ధ్వంసం అయ్యాయని, విద్యార్థుల సర్టిఫికెట్స్ ఉన్నాయన్నారు. విద్యా సంవత్సరం పూర్తయినవారు టీసీల కోసం వస్తున్నారని, వారికి ఏమివ్వాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. 30 సంవత్సరాల నుంచి ఇక్కడ స్కూలు ఉందని, తాను 2020 లో తీసుకున్నానిని చెప్పారు. కరుణ, దయ, ప్రేమ అని బిషప్ చెప్పడమే తప్ప...ఆయన పాటించడం లేదన్నారు. ఉన్నతాధికారులు, మత పెద్దలు జోక్యం చేసుకుని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. పాస్టర్ కె.డి.ఐక్యతరావు మాట్లాడుతూ సీఎస్ఐ ఆస్తులపై బిషప్‌కు ఎలాంటి అధికారం లేదన్నారు. ఈ ఆస్తులన్నీ దక్షిణమండలి చెన్నై ఆధ్వర్యంలో ఉంటాయని, అక్రమంగా భవనాలు నిర్మిస్తూ ఉంటే కోర్టుకు వెళ్లి ఆపివేయించామని చెప్పారు. ఈ సమావేశంలో స్కూల్ డైరెక్టర్లు మనోజ్, ప్రధానోపాధ్యాయుడు ధీరజ్ పాల్గొన్నారు.

శిథిల గదులను కూల్చేశాం

కడప సీఎస్ఐ ప్రాంగణంలోని శిథిల భవనాలను కూల్చివేశామని రాయలసీమ డయాసిస్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. డయాసిస్ బోర్డింగ్ హాస్టల్ గదుల సముదాయం వందేళ్ల కిందట పెంకులతో నిర్మించారని, శిథిలమవడంతో కూలిచ్చేశామని తెలిపారు. ఇక్కడ ఉన్న ×న్యూ మోడల్ స్కూల్‌కు 2022 వరకు అనుమతిచ్చారని, అప్పటి నుంచి ఖాళీ చేయమని పలుమార్లు చెప్పినా కాలయాపన చేస్తు వచ్చారన్నారు. పాత గదుల్లో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరుగుతుందని భావించి కూల్చివేశామని తెలిపారు. స్కూల్ యజమాన్యానికి ఎలాంటి అగ్రిమెంట్, హక్కులు లేవన్నారు. కొందరు డయాసిస్ ప్రతిష్ట భంగం చేస్తూ, దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

తహసీల్దారుకు కోర్టు ధిక్కార నోటీసులు

రాయచోటి టౌన్ : సివిల్ కేసులో ప్రిన్సిపల్ జూనియర్ సివి ల్ జడ్జి ఆదేశాల ధిక్కరణపై రాయచోటి తహశీల్దారు, మున్సి పల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లకు నోటీసులు జారీ చేసినట్లు భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ టి.ఈశ్వర్ ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. రాయచోటి పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన మల్లికార్జున స్థలం అదే వీధిలో ఉంటున్న బండి మురళి, బండి హరిణిలు దౌర్జన్యంగా ఆక్రమించుకొన్నారని జూనియర్ సివిల్ కోర్టులో కేసు దాఖలు చేశారని తెలిపారు. సదరు వ్యక్తులు ఆ స్థలంలోకి వెళ్లరాదని 121/23 కేసు నమోదు చేశారన్నారు. పాముల మల్లిఖార్జున ఆ స్థలంలోకి వెళ్లరాదని తెలిసినప్పటికీ రాయచోటి తహసీల్దార్ తన కార్యాలయానికి పిలిచి మల్లిఖార్జునకు వ్యతిరేకంగా మాట్లాడటంతోపాటు వారికి వ్యతిరేకంగా వచ్చిన వారికి అనుకూలంగా మాట్లాడటం కోర్టు దేశాలను ధిక్కరించడమేనని చెప్పారు. దానిపై తహశీల్దార్‌తో పాటు మున్సిపల్ కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారికి నోటీసులు పంపడంతో పాటు ప్రైవేట్ కేసు కూడా చేయనున్నట్లు న్యాయవాది టి.ఈశ్వర్ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

రాజంపేట : మహిళకు మాయమాటలు చెబుతూ.. ఉన్నపాటుగా మెడలో గొలుసు లాక్కెళ్లిన సంఘటన మండలంలోని ఉప్పరపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఉప్పరపల్లెలో ఉన్న ఓ మహిళ వద్దకు బైక్‌పై వచ్చిన ఇద్దరు ఈ అడ్రస్ ఎక్కడంటూ ఆరా తీశారు. ఆమెను మాటల్లోకి దించి అదును చూసి మెడలో నుంచి సరుడు అపహరించుకుపోయారు. పట్టపగలే జరిగిన ఈ సంఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియమాకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని పలు మండలాలకు మండల పార్టీ కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

కురబలకోట మండలం: ఉపాధ్యక్షులుగా డి.అశోక్‌కుమార్‌రెడ్డి, వి.ముస్తాక్, ప్ర ధాన కార్యదర్శులుగా ఎం.గోపీనాథ్‌రెడ్డి, వి.శంకర్‌రె డ్డి, కె.శివశంకర్, జి.రమేష్‌రెడ్డి, కార్యదర్శులుగా పి.రమణ, వేణుగోపాల్‌రెడ్డి, వై.నారాయణ, ఎస్.అంజద్, బి.తులసిరామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఇ.చలపతి, ఎన్.మంజునాథ్, బి.వేణుగోపాల్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, బి.రవీంద్ర, ఎస్.సురేంద్రారెడ్డి, మునాఫ్, జి.సోమశేఖర్‌రెడ్డి, జి.నాగేశ్వర్, మహబూబ్‌అలీ, ఎస్.బావాజీ, ఎం.శ్రీనివాసులు, కె.మహబూబ్‌పీర్, ఈరప్ప, బాబు, సి.రమణారెడ్డి, శివలను నియమించారు. **పెద్దముడియం:** ఉపాధ్యక్షులుగా సి.రెడ్డెప్పరెడ్డి, కె.జగన్‌మోహన్ ఆచా రి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.సుబ్బారెడ్డి, బి.సాంబశివారెడ్డి, ఎం.భాస్కర్, ఎం.సుధాకర్, కార్యదర్శులుగా ఎం.మహేశ్వర్, బి.మోహన్ రెడ్డి, కె.రామాంజులు, ఎ.రామచంద్ర, బి.అబ్దుల్ మునాఫ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డి.వెంకట శివయ్య, పి.ఆలంఖాన్, ఎం.అబ్దుల్లా, టి.అంజి, ఎం.శివయ్య, ఎస్.గౌస్‌మొద్దీన్, బి.గోపాల్‌నాయక్, పి.శ్రీనివాసులు, వై.లక్ష్మిపతి నాయుడు, బి.రవీంద్రనాయక్, పి.రమణారెడ్డి, ఎం.భాస్కర్ నాయక్, సి.ప్రతాప్‌రెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, బి.రవీంద్ర, కె.ఓబుల్‌రెడ్డిలను నియమించారు. **తంబళ్లపల్లె:** ఉపాధ్యక్షులుగా వెంకటరెడ్డి, మహేష్‌రెడ్డి, ప్రధాన కా ర్యదర్శులుగా జె.జగదీష్, వాసుదేవరెడ్డి, బి.రెడ్డెప్ప నా యక్, కార్యదర్శులుగా షఫీ, బావాజాన్, చలపతినా యుడు, రమణారెడ్డి, మల్లప్ప, మధురాయల్, ఎగ్జిక్యూ టివ్ మెంబర్లుగా రవి, శ్రీరాములు, శంకర్‌నాయక్, మురళీధర్, వి.ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మహేష్, బి.రవీందర్‌నాయక్, డి.రమణారెడ్డి, ఎ.అంజన్‌కుమా ర్, ఆంజనేయులు, ఆర్.చిన్నప్ప, టి.మధు, బి.వెంకట రమణ, సి.శ్రీనివాసులును నియమించారు.

వైభవంగా పుష్పయాగం



హాజరైన భక్తజనం



పుష్పయాగం చేస్తున్న వేద పండితులు

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహోత్మవాల్లో భాగంగా స్వామికి మంగళవారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన, భక్తులు సమర్పించిన వివిధ రకాల పుష్పాలతో వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పండితులు పుష్పయాగం నిర్వహించగా భక్తులు తిలకించి మురిసిపోయారు. పుష్పయాగంతో నారాపుర స్వామి బ్రహోత్సవాలు ముగిశాయి.

పోక్సో యాక్ట్ కేసులో యువకుడు అరెస్ట్



తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన నాగరాణి



ఆందోళన చేస్తున్న బంధువులు

- విష ద్రావణం తాగి తల్లి ఆత్మహత్యాయత్నం
- పోలీస్‌స్టేషన్ వద్ద బంధువుల ఆందోళన

కడప అర్బన్ : పోక్సో కేసులో కుమారుడిని అరెస్టు చేయడంతో తల్లి విష ద్రావణం తాగి అస్వస్థతకు గురైన సంఘటన కడప నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తమకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ వారి బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల వివరాల మేరకు.. కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామరాజుపల్లికి చెందిన విజయ్(22) మంగళవారం తెల్లవారుజామున తన కుమార్తె(17)కు మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని హరిజనవాడకు చెందిన జయమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రెడ్డెప్ప, ఎస్ఐ తులసీ నాగప్రసాద్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. సాయంత్రం నిందితుడు విజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నిందితుడి తల్లి ఆత్మహత్యాయత్నం

పోక్సో యాక్టు కేసులో కుమారుడు విజయ్ అరెస్టు కావడంతో అతడి తల్లి నాగరాణి, సోదరి రూప, బంధువులు, స్నేహితులు మంగళవారం కడప తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమయంలో తన వెంట తెచ్చుకున్న విష ద్రావణం నాగరాణి, రూప తాగారు. అస్వస్థతకు గురి కావడంతో పోలీసులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. రూపను మరికొంతసేపటికి తమ వెంట బంధువులు తీసుకుని వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులకు, నిందితుడి బంధువులకు వాగ్వాదం జరిగింది. పోలీసులు తమకు అన్యాయం చేశారని, రాజీ చేస్తామని చెప్పి చివరకు విజయ్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారనిఆరోపించారు.

చట్ట ప్రకారమే చర్యలు: సీఐ

తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామరాజుపల్లెకు చెందిన జయమణి తన కుమార్తెను విజయ్ మాయ మాటలు చెప్పి తీసుకుని వెళ్లినట్లు ఫిర్యాదు చేయడంతో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితుడిని చట్ట ప్రకారమే అరెస్ట్ చేశామన్నారు. కేసు, అరెస్ట్‌ల గురించి నిందితుడి బంధువులకు స్పష్టంగా తెలియజేశామన్నారు. అనవసరంగా ఆందోళన చేశారన్నారు.